# 'మిస్ లైలా'

గొల్లపూడి జోగారావుగారు

## ౧

నాటిరాత్రి యెనిమిదిగంటలకు రాజమండ్రీ స్టేషను వదిలేను. ఒంటరిగా ఉండొచ్చుననీ, పెద్దవాళ్లు ఎక్కేబండనీ రైలు కదలుతుందనగా వెళ్లి ఒకమూల కూర్చున్నాను. ఎక్కడికెళ్లినా యీదీను రాలి జీవన మొక్కలాగే వుంది. నన్నిట్టిబాముల గుడి పించుచున్న విధిని మాచేను. మాతృదేవి మంగళాకారమును దృష్టిపథమున గుర్తించుకొని వెక్కివెక్కి యేడ్చే నొక్కగడియ. నాతండ్రి మనోహరమూర్తి చిత్రించుకొని దుఃఖించేను. ఈవిశాలప్రపంచములో నన్నొక అనాథను గావించిన భర్త నొకసారి స్మరించుకున్నాను. నన్నింతవరకు పెంచిన మేనమామకు మనసులోనే వందన మొనరించేను. ఈర్ష్యావేశురాలై ...గర్వాంధురాలై ...నన్నిట్టి నీచురాలిని గావించిన దాజేశ్వరినిర్దయకు చింతించేను. ఆమె అధికారగర్వమున కంతరాయము కలుగకపోవునా ? దిక్కులేనిదాననని తెలిసియు నన్ను బారదోలిన దోస మామెకు దగులక పోవునా ?...అని మనసులో సంతుష్టి పొందేను. ఆమె భర్తకు చెల్లిలికూతుర్ని. అట్టి నన్నామె యేరీతి హింసించినదో గ్రహించి విలపించేను. 'దాసీదానిగా వుంటూ ......నాకు దిక్కు లేదు. నన్ను తరిమీకు......' అనిన నా దీనవచనములు పెడచెవిని పెట్టిన ఆమెకాఠిన్యమునకు ఆశ్చర్యపోయేను. 'తండ్రీ! నన్నింతదాని జేసి నాకు వివాహం చేసావు. ఇప్పుడు నన్ను వదిలిస్తావా ?' అని మేనమామదగ్గర రోదన మొనరిస్తూంటే, 'నాయింటివద్ద యేడవకు... అవతలికి పో' యను ఆమెఅధికారగర్వమునకు తెల్లబోయేను. భర్తవంకవాళ్లు భాగ్యవంతులై నా యిల్లాంటి దీనస్థితిలో పనికొచ్చేరు కారు గదా అనుకున్నాను. నాజననిస్నేహితురాలు అన్నపూర్ణ ఆదరభావమున కలరుతూంటే నాదురదృష్ట మామెయేకపుత్రీ మృత్యు వెట్లయిందో తలచి నామందభాగ్యము నకు నిందించుకున్నాను. పుట్టి పెరిగిన రాజమండ్రీలోనే కష్టదశయందు జీవనోపాయము లేకపోయింది కదా అని విస్మయ మందేను. నాలాంటి నిర్భాగ్యలు-అనాథలు-నికృతలై యెందరీవిశాలప్రపంచమున రోదన మొనర్చుచుండిరో యని వెక్కివెక్కి యేడ్చా, మగొక్కమారు. రైలు రొజుకొనుచూ పోతూంది. ఎంతదూరం పోయిందో, యెక్కడెక్క డాగిందో నేను చూడనే లేదు... అల్లా నాఆలోచనలు పోయాయి. తుదకు ఒకస్టేషనులో ఎవరో నే నున్న పెట్టి తోసి లోపల ప్రవేశించారు. నన్ను చూడ్డంతోటే ఆయన దిగిపోబోయారు కాని రైలు కదలింది. ఆపురుషు డల్లా కూర్చోవాలి సొచ్చింది. నావికృతాకారం వింతగా తట్టుండొచ్చు. ఒక్కగడియ నిదానంగా చూచే డాతడు.

'మీది రాజమండ్రీ కామా ?' అని ప్రశ్నించే డాయన. ఇంతసిగ్గు విడిచీ జీవనం చేస్తూన్నా పరపురుషు డల్లా ప్రశ్నించడంతోటే నాముఖాన్ని విపరీతపు సిగ్గు దొంతరలు అవనతక్రియలో దాచేశాయి. నీరవమైన కెంపెదవులు చలించిపోయేయి.

అతడు మళ్లీ ప్రశ్నించేడు.

'సత్యనారాయణగారు మీ మేనమామ గారూ ?'

అవునని జవాబు చెప్పే గాబోలు.

అతడు నాకేసి తిరిగిచూడలేదు.

బండి ఆగింది మళ్లా. ఆపెట్టెను విడిచి దిగి వెళ్లిపోయా డాయన. నావిపరీతపు సిగ్గును చూచే అతడల్లా వెళ్లిపోయుంటాడని గ్రహించేను. అట్టి సత్పురుషులు—సాధుశీలురు ఒకరిద్ద రున్నారని ఆనందించేను. బేసినుబ్రిడ్జిస్టేషనువరకు అల్లాగే కూర్చున్నాను. ఎవరో సూటు వేసుకొని దొరటోపి చంకను పెట్టుకొని ఒకాయన బండీ యెక్కే రక్కడ. టికెట్టు నాదగ్గర

లేదని తెల్సుకుని అతడు పెదవులు బిగించేడు. అతని వికృతాకారమునకు ఒడలు జలదరించింది. ఈరీతిగా సంభాషణ జరిగింది మాకు—.

అతడు—ఎవరు నువ్వు? టిక్కెట్టు లేకుండా యెందు కెక్కావు?

నేను—నే నొకదీనురాలిని... చెన్నపట్నంలో నాజీవనోపాధిని సంపాదించుకొనుటకై యిల్లా వచ్చేను.

అతడు—టిక్కెట్టుసొమ్ము లేకపోయిన బండి దిగు.

నేను—తండ్రీ! నేను అభాగ్యను. నన్ను వదలీ.

అతడు—దిగు... లేకున్న బలాత్కారముగా పైకి తోసేస్తా.

ఆకఠినహృదయుని మరలింపజాలనని తెలుసు కున్నాను. ఆతని క్రూరచూపులకు ఒళ్లు వణికింది. నెమ్మదిగా బండి దిగిపోయాను.

‘పద — స్టేషనులోకి.’

నే నాతని నిర్దాక్షిణ్యమునకు తెల్లబోయి చూస్తున్నాను. నన్ను బండిలో ప్రశ్నించిన పురుషుడే తెంచి,

‘ఎందు కామె నిట్లు బాధిస్తున్నావు?’ అని ప్రశ్నించే డతణ్ణి యింగ్లీషులో.

‘టిక్కెట్టు అడుగుతున్నా’ (ఇంగ్లీషులోనే).

పురుషుడు మాట్లాడకుండా జేబులోంచి టిక్కెట్టు తీసి యిచ్చేడు. జరగిన సమాచారము గనుచూ స్తంభించిపోయాను. ఆవింతపురుషు డెవగని యోచించేను ఆతని మొగముకేసి తెల్లబోయి చూస్తున్నాను.

‘లీలావతీ, బండీలోకి పోయి కూర్చో. పని మీద వెళుతూన్నా. మళ్లా నిన్ను కలుసు కుంటాను.’

మాట్లాడకుండా వెళ్లి పెట్టిలో కూర్చున్నాను. ‘అతనికి నీపే రెల్లా తెలిసింది’ అని మనసు నన్ను ప్రశ్నించింది. అత డెవరు? అతని నామ మేమిటూ తెలిసికొనవంగులకు నాలో దూషించుకున్నాను. అత డేదేనా దురుద్దేశముతో యిల్లా జేస్తూన్నాడేమో అని భీతిల్లేను! ఇట్టి దీనజీవనము చేయుటకన్న మరణించుట మేలని భావించుకొని దుఃఖించేను.

౨

అల్లా యెంతసే పున్నానో స్టేషనుదగ్గర. అత డెప్పటికీ రాలేదు. ఆమద్రాస్ మహాపట్టణంలో ఎక్కడి కెళ్లడం? ఈదీనురాలిని చూచేవా రెవరున్నారు? వెళ్లాల్సిన స్థలము మనోగతం కాకపోవుటచేత కాళ్లు వెనక్కి లాగేయి. అయితే ఆరుబయల్నుండి యాపతిత చేసే దేముంది కనుక! ఆచలిగాలిలో వణుకుతూ—కళ్లవెంబడి నీళ్లు కారుస్తూ బయలుదేరేను, ఎచటికో. ఆపట్నంలోని ధ్వనులు మెల్లగా అంతరిస్తున్నాయి అప్పుడే. ఒకవిశాలమైన భవనందగ్గర కొచ్చాను. లోపల దీపాలతో కాంతిమంతమై ఉంది. గేటుమీద చెయ్యానుకుని శూన్యదృష్టులతో చూస్తూ నించున్నాను. ఈఅభాజనురాలి శల్యపంజరమును దాచుకొనుట కింత వసతి ఉంటుందని ఆశ జనించింది. ఈదిక్కుమాలిన దీనురాలిపై జాలి వహించకపోతారా యని ధైర్యం కలిగింది. గేటు తెరచి మెల్లగా అడుగులేసుకుంటూ లోపల ప్రవేశించాను. నాహృదయంలోని ఆకొంతఆసను ఎగరవైచుకు పోదామని సమీరణుడు కూడ నాసుకుమారశరీరాన్ని మరింత వేధిస్తున్నాడు.

‘ఎవరు ?......’ అని గంభీరనాదం వినబడ్డాది.

‘నాయనా, నే నొక అనాథను. ఈరాత్రికి తల దాచుకొనుట కింత తావు లేదా?’ అని జాలితో అడిగేను.

‘దొరలు నివసించు బంగళా. ఇక్కడనుండి వెంటనే వెళ్లిపో......’

నా ఆశలన్నీ నిరాశ లయేయి. నాహృదయ కేదారమున మొలకలెత్తిన ఆశలన్నీ ఆ గభీరఝంఝానిలంలో పటాపంచ లయిపోయేయి.

'బాబా, దొరలైన నేమి?...ఒకమూల పరుండి ఉదయాన్నే పోతా!—' అన్నాను.

'ఏమి నీమూర్ఖత్వము! ఇచట పనికిరాదు. మరోదగ్గరకు పో.'

'నాయనా, నాకీ ఊరు క్రొత్త. ఈచలిలోనే చనిపోవనున్నాను' అని రోదన మొనరించేను.

'అవతలికి గెంటివేయవలెనా?' అని జవాబు వచ్చింది. అతని మూర్ఖత్వమునకు ఆశ్చర్యపోయాను. నానిర్భాగ్యత్వమునకు చింతించేను. దుఃఖము అతిశయించింది. వెక్కివెక్కి యేడ్చాను. ఏడ్చి లాభ మేముంది గనక. మరల బయలుదేరా, ప్రపంచంలోకి. ఆకలి ఒకమూల దహించివేస్తూంది. రాజమండ్రీలో ఆవేళ మధ్యాహ్నము తిన్నా, ఆఖరుసారి. ఆనాటి దృశ్యము చిత్రించుకొనడంతోటే హృదయము ద్రవీభూతమైంది. అమాయకురాలైన విమలమరణమునకు కారకురాలిని గదా అని నాలో దూషించుకున్నాను. ఆమెను అరుగుపై ఒంటరిగ విడిచిపోయిన మహాపాపిని గదా అని వలవల యేడ్చాను. ఏకపుత్రీ వియోగమునకై అన్నపూర్ణ యెల్లా విలపిస్తూందో అని నీరవనైపోయా. ఏమైతే యేం లాభం? అరుగుపైనుండి పడి చనిపోయిన విమల బ్రతికిరాదు. కరుణాస్వరూపురాలగు అన్నపూర్ణ వికలమైన హృదయం సరికాదు......నిర్భాగ్యురాలగు ఈపాపి కెల్లా శాంతి కలుగుతుంది? అడుగులు తడబడుతూండగానే నడిచా. ఎంతదూరం నడిచానో—ఎంతసేపు నడిచానో: మళ్లా ఒక భవనముం దాగేను. క్రిందటిదానిమల్లే యిది నిశ్శబ్దంగా వుండలేదు. దాని యొక్క స్థితిగతులుబట్టి ఒకహోటలైవుంటుందని భావించుకున్నా. మెల్లగా నడిచి గేటువరకు వెళ్లాను.

'ఎవరమ్మా మీరు? ఇక్కడ బసచేస్తారా?' అని జాలి ఉట్టిపడేలా అడిగే డొకాయన, అరవంతో.

(తర్వాత తెలిసింది అత డాహోటలు యజమానని.)

'నే నొక అనాథను. నాదగ్గర తగినధన మేమీ లేదు. నన్నీరాత్రిచట తల దాచికొననీయండి' అన్నాను.

నే చెప్పిన దాతనికి బోధపడనట్టు చూచేడు. బోధపడీ అల్లా నటిస్తున్నాడో. అతనితో మాటాడుచుండిన పురుషు డొకడు-నేచెప్పిన దాతనికి అరవంతో తెలియచేసేడు. ముఖంలోని భావప్రకటనబట్టి అతడు నావిన్నపమును నిరాకరించినట్లు తెలిసికున్నాను. నా దురదృష్టమున కొకసారి విచారించాను.

'నాయనా, నా కెవ్వరూ దిక్కు లేరు ఈ విశాలప్రపంచములో నే నేకాకిని....కట్ట గుడ్డ నిండుగా లేదు....తినుటకు తిండి లేదు. అట్టి యీదీనురాలిపై మీకు నిర్దయ యెందుకు?......' అని యింకా యేమేమో చెప్పబోతున్నాను. ఆపురుషుడు నావైపు పరికించి చూచేడు. ఆచూపులలో ఏదో అర్థ ముంది. అట్టి దృష్టిఘాతములకు భయవిహ్వాల నయ్యేను. హోటలు యజమానితో యేదో భాషించే డాతడు. తర్వాత నాకేసి తిరిగి,

'అమ్మాయీ! నావెంట రా. నీకు తగిన సదుపాయము చేస్తా' అన్నాడు.

ఆకంఠస్వరములో మధురత్వము లేదు. ఆతని వెంట పోవటం మంచిది కాదేమో అని జంకేను. ఇట్టి పతితను హింసించి అత డేల పాపమున కొడిగట్టుకొనునని ధైర్యము వహించేను. ఆపన్నురాలను, అబలను; అట్టినాయెడ నాతడు వేరువిధముగ నేల చరించునని గర్వించేను. అతనివెంట బయలుదేరా. మేడమీద ఒక గదిలోకి తీసికెళ్లా డాయన. గదిమధ్య కెళ్లి యేదో వాగించేడు. కొలదికాలములోనే భోజనపదార్థములు పట్టుకొని ఒక డొచ్చాడు.

'ఇచట ఉంచి వెళ్లిపో.'

అట్టిగర్వితుణ్ణి చూచేను. నా శరీరము నాకు లొంగక వణక నారంభించింది.

'అమ్మాయీ!...మంచిబట్ట లిస్తా, అవి విప్పు.'

నా కివే చాలునని చెప్పలేకపోయాను. నాకేవీ అక్కరలేదు, పడుకుంటాను అని చెప్పాలనుకున్నాను. నో రెండిపోయింది. అతడు గదితలుపు

వేసాడు. నేను నీరవ నైపోయా. సూటుకేసులోనుండి ఒకచీర దీసి నాదగ్గర కొచ్చాడు. నాఅవయవములు మరి పనిచేశాయి కావు అతడు నాచెయ్యి పట్టుకున్నాడు. నాసౌందర్యమే నా కిట్టికి డోనగూరుస్తూందని తెలుసుకున్నాను. నాయీహృదయవైకల్యమునకు కారణము నామనోజ్ఞాకారమే అని గ్రహించేను. కెవ్వన నార్చి దూరంగా పోయా. ఎలాగో నాకే తెలీదు. అతని భావములు మారలేదు. నేను స్తంభించిపోయాను.

'నిన్ను రక్షించేవా రిక్క డెవరూ లేరు. నీకెందు కీదుఃఖము?...నిన్ను ఆనందసాగరమున ముంచేస్తా......' అని యింకా యేమో చెప్పబోతున్నాడు.

నాభర్త నిశ్చలాకారమును చిత్రించుకున్నాను. 'బొటబొట' కళ్లెంబడి నీళ్లు కారిపోయాయి. ఈ దీనురాలి కేల యిన్ని సంకటములు? హా విధీ! నన్నిలా పరీక్షిస్తున్నా వేమి?

పఢాలున తలుపు విరిగింది. నాకు రైలు దగ్గర కనబడిన పురుషుడు—చేత్తో కఱ్రను బట్టికొని, ఒక డ్రయివరు లోపలి కొచ్చారు.

అతని నేత్రాలలోంచి అగ్ని కురుస్తోంది.

అతని ముఖమంతా వేడిరక్తంతో కూడుకొనుంది.

'దురాత్మగ్గుడా! ఆమె నీసోదరి కాదటరా?... అట్టి అనాథను బాధింపదలచితివా?...ధన సమన్వితుడవైన నీకన్న...పవిత్రహృదయ యగు ఆమె వేయిరెట్లధికము కాదా!......'

అంతవర కావరించిన అంధకార మా తేజోమూర్తివల్ల పటాపంచ లయింది...'నీవు నాపాలిటి దైవమవు....నాదురదృష్టములో నే నృదష్టవంతురాలినే అనుచు మూర్ఛపోయాను.

*     *     *     *

# 3

మధ్యాహ్నసమయానికి దగ్గరగా మళ్లీ తెలివొచ్చింది. నే నొక ఆసుపత్రిలో పరుపుమీద పరుండున్నాను. తలకి కట్టుకట్టుంది. నాజీర్ణవస్త్రాలెల్లాగో మాయమయేయి. ఈదురదృష్టవంతురాలి కిట్టి సమపాయ మెల్లా సంభవించిందా అని సంకోచించాను. దగ్గ రెవరో వున్నట్టుగా తోచింది. కర్టెను తొలగించి చూచేను. దేనినో నిదానించి చూస్తూన్నా డాతడు. అతని చూపుల్లో బాధ మిళితమై వుంది. ఆచూపుల్నే అనుకరించాను. కాని నా కేమీ అగుపించలేదు. ఆలోచనాపూర్వకంగా నించున్నా డాతడు. అతని సమాధిని చెరపకుండా కొంతసేపు వూరుకున్నాను. కాని నాహృదయాందోళన ఆగలేదు. ఆబాధలో దగ్గొచ్చింది. అతనిసమాధి భిన్నమైంది. అతడు వెనుదిరిగి చూచేడు. నాచేతిని తీసి నాడి పరీక్షించే డాతడు.

'ఒంట్లో మరేవీ బాధ లేదుకదా?'

ఇల్లాంటి జాలిపలుకులు మళ్లా మూడుసంవత్సరాలకి విన్నాను.

'లేదు. నిద్రపోయాను. తిరిగీ మంచిస్థితికి వస్తూన్నా ననుకుంటాను.'

అతడు మందిచ్చి వెళ్లిపోయాడు.

ఆరాత్రే అతడు నాచరిత్ర నంతను విన్నాడు. నే పడిన బాధలన్నీ తెలిసికున్నాడు. ఒక దీర్ఘనిశ్వాసము విడిచే డాయన. రోజూ రెండుపర్యాయములు చూస్తూ వుండేవారు.

ఆవేళ మామూళ్లలుగా ఉదయం ఏడుగంటలకి మేరీ వచ్చింది నాదగ్గరకు. మేరీ తెల్లనిశరీరం...విశాలనేత్రములు... పరుల నాకర్షిస్తాయి. ఆచూపు లాపవిత్రహృదయప్రేమనైర్మల్యమును చాటుతాయి. రోగులను ఆమె నిర్మలమైన, సుకుమారమైన వేళ్లతో తాకేది. ఆమెకంఠము ముగ్ధవచనాలని వర్షించేది...ఆమె నిర్మలహృదయ. ఆమె పవిత్రహృదయ. అందుచేతే ఆమె

తేజఃపూరితమై వుంది. ఆతేజస్సు ఆమెనేత్రాలలో నిండుకొని వుంది; ఆమెపెదవులపై దీపిస్తూంది.

అట్టి మేరీకి నాకూ పరిచయం కలుగజేసిన దేవుణ్ణి కీర్తించాను. ఆమెకు నాయెడ నుండే ప్రేమకు... ఆదరణభావమునకు సంతసించేను. ఈప్రపంచంలో ఇల్లా ఒకరికి ప్రేమార్హురాల నయ్యేకదా అని ఉప్పొంగేను. ఈమూనాలుగురోజుల పరిచయములో మేరీకి నాయెడ కలిగిన గాఢమైన ప్రేమకు గర్వించేను.

మేరీకి నాకూ ఇల్లా సంభాషణ జరిగింది—

మేరీ—డాక్టరుగా రొచ్చి చూసేరా?

నేను—ఉఁ.

మేరీ—ఏమంటున్నారు?

నేను—మేరీ చాల కష్టపడిం దన్నారు.

మేరీ—టానిక్కు పుచ్చుకున్నావా?

నేను—ఇప్పుడే తీసుకున్నాను.

మేరీ నాదగ్గర కొచ్చి తలగాయం పరీక్షించింది. ఆమె సుకుమారమైన వేళ్లు నాజుత్తును సరిచేస్తున్నాయి. ఆమెనిశాలనేత్రాలలోకి చూచేను. నాజాలిచూపులలోని రక్తిమ కనిపెట్టిం దామె.

'లీలావతీ! నీ వెన్నో బాధల కోర్చేవు. డాక్టరుగారి వల్ల నీచరిత్రంతా విన్నాను. ఆనందరావు, డాక్టరుగారు చదువుకున్నారు. నీభర్తను చూస్తే అతని కెంతో ప్రేమ. ఆనందరా వీఆస్పిటలులో చనిపోవునపుడు నే దగ్గరే వున్నాను. అతడు దురదృష్టవంతుడు.'

నాకళ్లలో గిరగిర నీళ్లు తిరిగేయి.

'దుఃఖించొద్దు. భగవంతుని నమ్మియుండుము. అతడే నీకు సుఖము చేకూర్చగలడు.'

'నా కీజన్మమున నిక సుఖము లేదు, మేరీ!... నే తగిలివేయబడ్డా. ఎక్కడికి కెళ్లినా తగిలివేయబడ్డాను...ఆసుపత్రిలోనుండికూడా వెళ్లిపోవాలి... మళ్లా యీలోకంలో నే నేకాకినే....భిక్షురాలినే. ...మేరీ! నన్ను రక్షింపవు?'

## ౪

ఆసాయంత్రము మేరీ నన్ను తనగదిలోకి తీసుకుపోయింది. ఆమెమంచాని కెదురుగా యేసుక్రీస్తు బొమ్మ తగిలించుంది. మేరీ చిన్నతనంలోనే ఆమెజననీజనకుల గోల్పోయింది. కాన్వెంట్ (Convent) స్కూలులో విద్యాభ్యాస మొనరించి...తన జీవితమును పరుల కుపయోగింప నిశ్చయించి నర్సుట్రెయినింగు కెళ్లింది. మేరీ ఆసుపత్రిలో దాదిగా ప్రవేశించపుడే మూడేళ్లవుతుంది. మేరీ వివాహం చేసుకోలేదు. ఆమె తన వక్షస్థలమున దీపించుచున్న క్రాసు (Cross) నే నమ్ముంది.

గదిలో ప్రవేశించగానే మేరీ తన పరుపుమీద నా కాసనం చూపింది. ఆప్రేమమూర్తిశిలమును మనసులోనే కీర్తించాను. ప్రక్కనున్న కుర్చీలో కూర్చుందామె. మేరీమొగములోని సూచనలబట్టి అమె నా కేదో చెప్పదలచుకున్నట్టు గ్రహించేను. టేబిలుమీదున్న బైబిలు తీసి దాని నూరక త్రిప్పుచు నాకేసి చూచింది.

మేరీ—లీలావతీ! నీ వీనరకకూపమునుండి వెల బడుట కొక ఉపాయం ఉంది.

నేను—అల్లాంటిది నాకు చెప్పమనే కాదూ కోరింది.

మేరీ—నీవుకూడ నొకదాదిగా నేల ప్రవేశింపరాదు?

నేను—అట్టిపని నాకు లభ్యమవడం ఎల్లాగ?

మేరీ—నీయిష్టం చెపితే డాక్టరుగారితో చెప్పి నీ కది సాధ్యం గావిస్తాను. పరులకై యీజీవితము నుపయోగించుటకన్న ఘన మేమీ లేదు.

నేను—మేరీ! నేను నిజముగా నట్టిదానికి పాత్రురాలనేనా?

మేరీ—నీజీవితము నంతకంటె మంచి విధముగా నుపయోగింపజాలవు.

మేరీమూర్తి నాకు రోజూకన్నా అందంగా కనబడ్డది. ఆమె కాంతితో నిండుకొనిఉంది. మేరీ

వక్షస్థలాన్నున్న క్రాసులో ఎదురుగా నున్న యేసు మూర్తి ప్రకాశిస్తూంది. 'మేరీహృదయం గ్రహించు. ఆమె చెప్పినట్లు చెయ్యి' అని అతడు చెపుతూన్నట్టుగా అనుకున్నాను. ఈపతిత యిల్లా ఒరులకు పరిచర్య సలుపడానికి వీలు కలుగుతుంది కదా అని నాలో ఆనందించేను. పనికిమాలిన యీదీనురాలు పరులకష్టదశలో నుపయోగపడునని తలచి నాకష్టములను మరచిపోయాను. తినుటకు నిండుగా తిండిలేని యీనిర్భాగ్య స్వతంత్రజీవనము సలుపటానికి తగిన సమయం వస్తుంది కదా అని ఒకటిరెండు హర్షాశ్రువుల రాల్చేను. మానభంగమునకై వెఱచిన యీదీన మళ్లీ పవిత్రజీవనము చెయ్యగలదని గ్రహించి సంతసించేను. 'రాజేశ్వరీ! నీవు నన్ను తగిలీసేవు; అది నా కుపకారమే అయింది' అని ఆమెను మనసులోనే తలచుకున్నాను.

'మేరీ! నేనూ ఒకదాది నవుతా. నాసోదరుల నెందరినో మృత్యుగహ్వరమునుండి తప్పిస్తాను. ఇల్లా దీనదశలో వుండే నా దేశానికై పాటుపడతా.'

'ఏసు నీకు మేలొనగూర్చుగాక!' అంది మేరీ.

'మేరీ! నీవు ప్రేమజీవివి. అల్లా జీవించడం నాకూ చెప్పేవు. నీవు నాగురువువి.'

'అందరికీ గురువు ఆయేసువు.' అంది మేరీ.


ఆప్రేమజీవిని ధ్యానించే నొక్కసారి.

మేరీ నిశ్చలాకారమును చూచేను. మంచం దిగిపోయి ఆమెపాదములదరి మోకరించేను.

'మేరీ! ఒక పేదరాలిని రక్షించిన పవిత్రహృదయవు నీవు.'

ఆతెల్లనిచేతిని నాపెదవుల కంటించేను. మేరీ నామొగ మెత్తి నానుదుటిని ముద్దాడింది నిశ్శబ్దంగా.

ఆసాయంకాలమే మా పరిచితురాలు లీలావతి 'మిస్ లైలా' అయింది.



తులసీఘట్టము, కాశీ

(ఈ చెట్టుక్రిందనే తులసీదాసు రామాయణమును వ్రాసెనని ప్రవాదము.)

P. S. N